

సంతలో తగ్గిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు వారపు సంతలో ఆదివార గిరిజనులు ఆకుకూరలు, కాయగూరలు తీసుకొచ్చారు. గిరి రైతులు పండించిన వంకాయలు, పచ్చిమిర్చి, బెండ, దొండ, టమోటా, చిలగడదుంపలు వాటా రూ.20 చొప్పున విక్రయాలు జరిపారు. గత రెండు నెలలుగా కొండెక్కిన కూరగాయల ధరలు ప్రస్తుతం దిగుబడులు ఎక్కువ రావడంతో తక్కువ రేట్లు లభిస్తూ సామాన్య మానవుడికి అందుబాటులోకి వచ్చాయి. రెండు వారాల కిందట చిక్కుడు పిక్కలు డొక్కు రూ.30కి విక్రయించగా, ఆదివారం సంతలో కేవలం పది రూపాయలకే విక్రయించారు. రేటు తగ్గడంతో చిక్కుడు పిక్కలు కొనుగోలు చేయడానికి వినియోగదారులు బారులు తీరారు. రానున్న రోజుల్లో ఆకుకూరలు, కాయగూరలు ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.



సంతకు తీసుకొచ్చిన కూరగాయలు

పర్యాటక సందడి

▸▸మన్యంలో పోటెత్తిన పర్యాటకులు ▸▸ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు



వంజంగిలో కొండలను ఆవరించిన మేఘాలను తిలకిస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి-పాడేరు,పాడేరుటౌన్: **మన్యంలోని సందర్శనీయ ప్రదేశాలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ప్రస్తుతం పిక్నిక్ సీజన్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి జనం మన్యంలోని పర్యాటక ప్రాంతాల బాట పట్టారు. దీంతో, ఆదివారం ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రదేశాలు కళకళలాడాయి.**

ప్రస్తుతం వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడం, పిక్నిక్ సీజన్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అరకులోయకు, అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఆదివారం ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల హడావిడి నెలకొంది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు పర్యాటక సందడి నెలకొంది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలవిహారీ, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, లంబసింగి, యర్రవరం జలపాతం తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు.



అరకులోయలో రద్దీగా ఉన్న పర్యాటకులు

వంజంగి హిల్స్ కళకళ

మండలంలోని వంజంగి మేఘాల కొండకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. మేఘాల పర్వతాన్ని తిలకించేందుకు మైదాన ప్రాంతం నుంచి వందలాది మంది పర్యాటకులు శనివారం సాయంత్రానికి పాడేరుకు చేరుకొని ఇక్కడ బస చేశారు. కొందరు పాడేరు లాడ్జీల్లో కొందరు బస చేయగా.. మరికొందరు వంజంగిలో ఏర్పాటు చేసిన టెంట్లలో రాత్రి బస చేశారు. ఆదివారం వేకువ జామున మేఘాల పర్వతంపైకి పయనమయ్యారు. గత వారం రోజులుగా మంచు తీవ్రత అధికంగా ఉండడంతో పర్యాటకులు ప్రకృతి అందాలు, మేఘాల పర్వతంపై పాల సముద్రాన్ని తలపించే మంచు మేఘాల అందాలకు పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ పరవశించి పోయారు.

లంబసింగిలో పర్యాటకుల తాకిడి

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పర్యాటక సీజన్ కావడంతో లంబసింగి ప్రకృతి అందాలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలి వచ్చారు. అత్యధిక సంఖ్యలో పర్యాటకులు స్థానికంగా బస చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మెజారిటీ పర్యాటకులు వ్యక్తిగత, సర్వీసు వాహనాల్లో ఉదయం ఐదు గంటలకు చేరుకుని సాయంత్రం వరకు పర్యాటక ప్రాంతాలను సందర్శించి తిరుగు ప్రయాణమయ్యారు. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు మంచు అందాలను తిలకిస్తూ పరవశించారు. ప్రకృతి అందాలను కెమెరాలో బంధించేందుకు పోటీ పడ్డారు. ఉదయం నుంచి 11 గంటల వరకు లంబసింగి జంక్షన్, చెరువులవేనం వ్యూపాయింట్ పర్యాటకులతో సందడిగా కనిపించింది. లంబసింగి పరిసర పర్యాటక ప్రాంతాలు సాయంత్రం వరకు సందర్శకులతో రద్దీగా కనిపించాయి.

కొత్తపల్లి జలపాతంలో సందడి..

మండలంలోని ప్రముఖ కొత్తపల్లి జలపాతంలో పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో భారీ ఎత్తున పర్యాటకులు సందర్శించారు. ఉదయం నుంచి జలపాతంలో పర్యాటకుల తాకిడి నెలకొంది. రోజంతా జలపాతంలో సందడి చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి పర్యాటకులు భారీగా తరలి రావడంతో జలపాతం కిక్కిరిసింది.

గిరిజన మ్యూజియం రద్దీ

అరకులోయరూరల్: అరకులోయలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో ఆదివారం సందడి నెలకొంది. దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో గిరిజన మ్యూజియం పరిసరాలు కిక్కిరిసిపోయాయి. సెలవుదినం కావడంతో అరకులోయ గిరిజన మ్యూజియం, మాడగడ మేఘాల కొండ, పద్మావతి గార్డెన్, కాఫీ మ్యూజియం వంటి పర్యాటక ప్రాంతాల్లో ఉదయం నుంచే సందర్శకుల రద్దీ భారీగా పెరిగింది.సహజ సౌందర్యంతో అలరారే ఈ ప్రాంతాల్లో పర్యాటకులు ఫోటోలు దిగుతూ, గిరిజన సంస్కృతి పారంపర్యాలను ఆస్వాదిస్తూ సంతోషంగా గడిపారు. పర్యాటకుల రాకతో స్థానిక వ్యాపారులు, రెస్టారెంట్లు, హెూటల్ యజమానులు సంతోషం వ్యక్తం చేశారు.

రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్ కిటకిట

అరకులోయ: అరకులోయకు పర్యాటకులు అధికం గా తరలి రావడంతో పలు రహదారుల్లో వాహ నాలు నిలిచి పోయాయి. అరకులోయలోని ఎండపల్లివలస రైల్వే స్టేషన్ ఎదురుగా రోడ్డులో రద్దీ పెరగడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, వానచోదకులు ఇబ్బందులు పడ్డారు. రహదారి పొడవునా వనభోజన దృశ్యాలే దర్శనమిచ్చాయి. అరకు- విశాఖ ఘాట్ రోడ్ లో పర్యాటకులతో రద్దీ పెరిగి వాన రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది.



అరకులోయలో మ్యూజియం వద్ద పర్యాటకులు



ఓటర్ల జాబితా వివరాలను పరిశీలిస్తున్న వివేక్ యాదవ్

ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్

ప్రజాశక్తి -అనంతగిరి: ఓటరు నమోదు ప్రక్రియ అభ్యంతరాలు లేకుండా సజావుగా చేయాలని, పోలింగ్ బూతులలో అన్ని రకాల వసతి సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికలప్రధాన అధికారి వివేక్ యాదవ్ సూచించారు. ఆదివారం మండలంలో పర్యటించిన ఆయనకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం శివలింగపురం బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉన్న 280- 281 పోలింగ్ బూత్‌లను సందర్శించి పరిశీలించారు. ముందుగా అనంతగిరి హరిత హిల్ రిసార్ట్స్ వద్ద మధ్యాహ్నం భోజన విరమణ సమయంలో సేద తీరిన అనంతరం స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణిలు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతగిరి, కొండపురం తదితర పంచాయతీల్లో ఓటరు అవకతకలు, తారుమారులపై లిఖితపూర్వకంగా విన్నవించారు. ఒక పంచాయతీ ఓట్లు మరో పంచాయతీ పోలింగ్ బూత్‌లో ఉన్నందున ఓటర్లు అక్కడకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఇబ్బంది తలెత్తుతుందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

అనంతరం హరితహిల్ రిసార్ట్స్ ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ, అల్లూరి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సాకేత్, ఆర్డీవో లోకేశ్వరరావు, తహసిల్దార్ వీరభద్ర చారి, స్థానిక జెడ్పిటిసి, ఎంపీపీ, పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు వెరిఫికేషన్, అభ్యంతరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నరేంద్ర, జనసేన మండల అధ్యక్షులు చిట్టం మురళి, పంచాయతీ బూత్ కమిటీ సభ్యులు మట్టం శ్యామ్, ఎస్ సుందర్రావు, ఆర్ఐలు, విఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట :శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల, జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవ శిబిరంలో భాగంగా నాలుగోరోజు అరట్లకోటలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన, చైతన్య సదస్సు, ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్ఐ పురుషోత్తం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థి, యువత సన్మార్గంలో నడవాలని, మత్తుపదార్థాలు చెడు సహవాసాలకు దూరంగాఉండాలని, తద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ధూమ, మద్యపానం అనర్థాలకు వివరిస్తూ, వాటిని దూరంగా ఉండి ఆరోగ్యభారత్ నిర్మాణానికై కృషి చేయాలని, సరైన ప్రణాళికతో చదివి, లక్ష్యసాధనకు విజయపథంలో దూసుకుపోవాలన్నారు.కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి పి భాస్కరరావు, గ్రామ సర్పంచ్ పి. అప్పలనరస, వేముల వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు కుందూరు కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో సిబ్బంది కొరత

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండటంతో సకాలంలో పనులు జరగక మండలంలోని గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి మండల పరిషత్ కార్యాలయం ప్రధానమైంది. ఈ కార్యాలయంలోని సిబ్బంది పూర్తిస్థాయిలో లేక పోవడంతో పనులు సకాలంలో జరగలేదు. దీంతో, మండలంలో జరిగే పలు అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని పలువురు అంటున్నారు. ఈ కార్యాలయంలో ఎంపీడీవో, సూపరింటెండెంట్, ఈవోపీఆర్డితో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్లు స్వీపర్లు ఉండాలి. ప్రస్తుతం ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్‌లు ఇద్దరు మాత్రమే ఉన్నారు. మిగిలిన ఇద్దరు అటెండర్లు ఉన్నారు. కార్యాలయంలో ప్రధానంగా పనులు జరగాలంటే సీనియర్ అసిస్టెంట్ తో పాటు జూనియర్ అసిస్టెంట్ ఉండాల్సి ఉంది. కానీ ఒక్క సీనియర్ అసిస్టెంట్ ఉండటంతో ఆయనపై పని ఒత్తిడి ఎక్కువ అవుతుంది. దీంతో సకాలంలో పనులు జరగడం లేదు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని మండలంలోని గిరిజనులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు


ప్రజాశక్తి - విఆర్‌పురం: డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మహాసభల పోస్టర్‌ను ఆదివారం ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి కార్మికవర్గ మేధావులు మహాసభలకు విచ్చేస్తున్నారని కార్మికుల పట్ల పాలకులు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఈ మహాసభల్లో చర్చ జరగనుందన్నారు. కార్మికుల, కర్షకుల హక్కులు చట్టాలను పరిరక్షించేందుకు చేయాల్సిన కార్యాచరణపై భవిష్యత్ ప్రణాళిక రూపొందించనున్నారని ఆయన తెలిపారు. కావున ప్రతి గ్రామంలో ఉన్న కార్మికులు, కర్షకులు ఈ మహాసభలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎంపిపి కారం లక్ష్మి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, సిఐటియు మండల కన్వీనర్ కో కన్వీనర్లు గొర్రె రాజు, ఎం రాజేశ్వరి, సిఐటియు నాయకులు సున్నం రంగమ్మ, సునీత కనక లక్ష్మి, రాములమ్మ, సుజాత ముత్తమ్మ, నూతన వరలక్ష్మి, మహిళా సంఘం మండల కార్యదర్శి కన్వీనర్ సోడి రమాదేవి, మడకం దారమ్మ సున్నం.రమాదేవి, గొర్రె శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - అడ్డతీగల: అడ్డతీగల మండల కేంద్రం గిరిజన సహకార సంస్థ పరిధిలో గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి అడ్డతీగల, రాజవొమ్మంగి గ్యాస్ ఆఫీసులో సంప్రదించాలని ఇన్‌చార్జి డివిజనల్ మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అడ్డతీగల, రాజవొమ్మంగి గ్యాస్ ఆఫీసులో సంప్రదించాలన్నారు. జిపిసిఎంఎస్, భారత్ గ్యాస్ ఏజెన్సీ నుంచి మ్యాండటరీ ఇన్‌స్పెక్షన్ చేసేందుకు గ్యాస్ సిబ్బంది వస్తున్నారన్నారు. చెకింగ్‌తో పాటు వంటగదిని పరిశీలించి గ్యాస్ వాడే విధానాన్ని గ్యాస్ పొదుపు మరియు భద్రతకు సంబంధించిన స్టవ్, రెగ్యులేటర్ , ట్యూబ్ ను పరిశీలించి వాడే విధానాన్ని తెలియజేస్తారన్నారు. రెగ్యులేటర్, పైప్ బాగులేకపోతే రూ.236 చెల్లిస్తే కొత్తవి వెంటనే అమర్చుతారని తెలిపారు.

సెల్ టవర్ ఉన్నా... సిగ్నల్స్ కరువు

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలోని నల్లగొండ మంప కొయ్యూరులో బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ ఉన్నా లేనట్టే ఉంది పరిస్థితి. నల్లగొండలో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పరిధిలో వినియోగదారులు ప్రతినెలా క్రమం తప్పకుండా రీఛార్జ్ చేయించుకుంటున్నారు. అయితే నెలలో కొద్ది రోజులు కూడా సిగ్నల్స్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది ఫోన్ నెంబర్లను తమ ఆధార్, బ్యాంకు, పోస్టాఫీస్ ఖాతాలకు లింకు చేసుకోవడంతో అత్యవసర సమయాల్లో మెసేజ్‌లు రాక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి టవర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



బిఎస్ఎన్ఎల్ టవర్

మహిళలపై దాడులను నియంత్రించాలి

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మడివి శ్రీదేవి



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

ప్రజాశక్తి- చింతూరు: మహిళల పట్ల జరుగుతున్న హింసాత్మక దాడులను ప్రభుత్వం నియంత్రించాలని మహిళా సంఘం ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మడివి శ్రీదేవి డిమాండ్ చేశారు. మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో చింతూరు స్థానిక బాలికల కళాశాల హాస్టల్ విద్యార్థులు కెజిబివి పాఠశాలలో జరిగిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీదేవి మాట్లాడుతూ నేడు మహిళల పట్ల జరిగే హత్యలు, అత్యాచారాలకు ప్రధాన కారణమైన మద్యాన్ని ఈనాడు ప్రభుత్వాలు ప్రధాన ఆదాయ వనరుగా భావిస్తూ విచ్చలవిడిగా మద్యం షాపులకు బార్లకు లైసెన్సులు ఇస్తూ గ్రామీణ ప్రాంతంలో సైతం బెల్ట్ షాపులు పెడుతు న్నారని ప్రజాసంపదను కొల్లగొడుతున్నారని వీటి ఫలితంగా యువత తప్పుదోవ పడుతున్నారని ప్రభుత్వం మద్యాన్ని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో సమాజంలో మహిళల పట్ల అనేక దాడులు జరుగుతున్నాయన్నారు. వీటితో పాటు పలు వెబ్‌సైట్‌లలో అశ్లీలం విశృంఖలంగా ఉంటోందని, ప్రభుత్వం వీటిని నియంత్రించడం ద్వారానే మహిళలకు రక్షణ ఏర్పడుతుందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా కొన్ని కేసులు పెట్టి మాత్రమే వదిలేస్తున్నారని సమస్యకు మూల కారణమైన మద్యాన్ని, మత్తు పదార్థాలను నియంత్రించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రతి పబ్లిక్ ప్రదేశంలో మహిళలకు రక్షణకు పర్యవేక్షణగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, రక్షణకు టోల్ ఫ్రీ వేగవంతం చేసి అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం సీనియర్ నాయకులు ముర్రం రంగమ్మ, చింతూరు మండల కార్యదర్శి బట్ట రాములమ్మ, నాయకులు మల్లం సుబ్బమ్మ తాటికొండ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి పులి



సీలేరులో కురుస్తున్న మంచు

ప్రజాశక్తి-సీలేరు: వాతావరణంలో సమూలంగా మార్పులు చోటు చేసుకోవడంతో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయాయి. జికె వీధి మండలం సీలేరులో చలి తీవ్రతతో ప్రజలు వణుకుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఉష్ణోగ్రత 12 డిగ్రీలు నమోదుకాగా, ఉదయం ఎనిమిది గంటలకు 16 డిగ్రీలకు చేరుకుంది. వాతావరణంలో తేమశాతం పెరిగిపోవడంతో చలి మరింత పెరిగింది. చలి అగస్మాత్తుగా పెరిగిపోవడంతో దినసరికూలీల పరిస్థితి దయనీయంగా మారింది. పనులకు వెళ్లలేక, మానలేక నానా అవస్థలు పడుతున్నారు. సాయంత్రం 4 గంటలు నుంచి చలిగాలులు వీస్తున్నాయి. రాత్రి 8 గంటలయ్యేసరికి చలి ఉధతం అవు తోంది. దీంతో వ్యాపారులు చలి తీవ్రతకు తట్టుకోలేక దుకాణాలు మూసివేసి ఇళ్లకే పరిమితం అవుతున్నారు.

కొయ్యూరు: మండలంలో ఆదివారం పొగమంచు దట్టంగా కురిసింది. రాత్రి సమయాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం సుమారు 9 గంటల వరకూ పొగమంచు కురుస్తూనే ఉంది. రహదారి కూడా కనిపించనంత ఎక్కువగా మంచు కురుస్తూ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల్లో క్రితం నుండి మంచు ఎక్కువగా కురవడంతో పాటు చలి తీవ్రత కూడా పెరిగింది.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ యాసీన్

ప్రజాశక్తి -సీలేరు: పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిం చరాదని ఎస్ఐ యాసీన్ హెచ్చరించారు. ఆటోడ్రైవర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఆటో డ్రైవర్‌కు లైసెన్స్‌తో పాటు ఇతర పత్రాలు కచ్చితంగా కలిగి ఉండాలన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాన్ని నడిపితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఇన్స్యూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి కలిగి ఉండాలన్నారు.



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1991-1992 పదోతరగతి బ్యాచ్‌కి చెందిన 40 మంది విద్యార్థులు పాఠశాలను సందర్శించి పాత జ్ఞాపకాలని నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం వారంతా ఉద్యోగాలు, వ్యాపారాలు రియల్ ఎస్టేట్ రంగాల్లో ఎవరి వృత్తుల్లో వారు బిజీగా ఉన్నారు. 33 సంవత్సరాల తర్వాత సీలేరు చేరుకుని చిన్నప్పుడు చూసిన ప్రదేశాలను చూసి పరవశించిపోయారు. అలాగే అప్పటి వారిలో కొంతమంది సీలేరులోనే ఉండడంతో వారితో మమేకమై పాత జ్ఞాపకాలను నెరవేసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. పూర్వపు విద్యార్థులు సుజాత, రాజు తదితరులు మాట్లాడుతూ ఊరు విడిచి వెళ్లి 33 సంవత్సరాలు అవుతోందని, సీలేరులో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. అనంతరం పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. స్థానిక ఎపి జెన్కో గెస్ట్ హౌస్‌లో వసతి, భోజనాలు చేసామని తెలిపారు.

9, 10 తేదీల్లో ఢిల్లీలో పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న ధర్నా, జాతీయ సదస్సు కార్యక్రమాలకు ఆదివారం విశాఖపట్నం నుంచి 40 మంది పెన్షనర్లు బయలుదేరి వెళ్లారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరంతా బయలుదేరి వెళ్లారు. వీరితో పాటు ఢిల్లీ వెళ్లిన అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ, కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, దీనికి డిఎ అదనంగా కలిపి ఇవ్వాలన్నారు. పెన్షనర్లు అందరి పెన్షన్ అధికం చేయాలన్నారు. పెన్షనర్లకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. సీనియర్ సిటజన్లకు రైల్వే రాయితీ కల్పించాలన్నారు.



గెడ్డ వద్ద పోగుగా వేసిన ఇసుక

ఇసుక అక్రమ రవాణా

అర్ధరాత్రి తరలింపు

ప్రజాశక్తి-కాశీపట్నం : అనంతగిరి మండలం కాశీపట్నం వాగు(గెడ్డ) నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అధికార పార్టీ అండదండలతో పెద్ద ఎత్తున రాత్రి 11.00 గంటలకు విశాఖపట్నం, పెందుర్తి, కొత్తవలస తదితర ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. ఇసుక అక్రమ రవాణా అరికట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో ఇసుక మాఫియా రోజు రోజుకు రెచ్చిపోతుంది. ఉదయం వేళల్లో ఇసుక రహస్య ప్రదేశాల్లో డంప్ చేసుకొని అక్కడి నుంచి రాత్రివేళల్లో ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా జరుగుతుంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న భూగర్భ జలాలు ఇసుక అక్రమ రవాణా కారణంగా మరింత అడుగంటిపోయే పరిస్థితులు నెల కొన్నాయి.సామాన్య ప్రజల ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అవసరం వస్తే సవాలక్ష నిబంధనలు చెప్పే అధికారులు ఇసుక అక్రమ రవాణా దారుల విషయంలో మాత్రం నోరు మెదపకుండా చోద్యం చూస్తున్నారని పలువురు గిరిజనులు దుయ్యబట్టారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

సినీ నటుడు సుమన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని సినీ నటుడు, మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ సుమన్ తల్వార్ తెలిపారు. ఉక్కునగరం సీ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వడోకాయ్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన కరాటే గ్రేడింగ్ బెల్ట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుమన్ తల్వార్, గౌరవ అతిథిగా కరణంరెడ్డి నరసింగరావు హాజరయ్యారు. పలువురు విద్యార్థులకు కరాటేలో వైట్, ఎల్లో, బ్లూ, గ్రీన్, బ్రౌన్, ఆరెంజ్, బ్లాక్ బెల్టులు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసంతో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుందన్నారు. అనంతరం అతిథులను నిర్వాహకులు సాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ సతీష్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి అంబు, అతిథులు గూటూరు శంకరరావు, గంధం వెంకటరావు, ప్రగడ నాగేశ్వరరావు, కోచ్‌లు గోవర్ధన్, సరస్వతి, రాజేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న విరాట్ కోహ్లి

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని ఆదివారం ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లి, ఆయన కుటుంబ సభ్యులు, ఆసియా కప్ టీమిండియా మాజీ మేనేజర్ పి.వెంకటరామ్ ప్రశాంత్, టీమిండియా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్, ఎసిఎ ప్రతినిధి విష్ణు దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వర్ రావు, పర్యవేక్షణాధికారి కంచి మూర్తి స్వాగతం పలికారు. వారు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు.



సింహాచలం అప్పన్నను దర్శించుకున్న విరాట్‌కోహ్లి

కలగా..రహదారుల నిర్మాణాలు

- అమలు కాని డిప్యూటీ సిఎం హామీ
- శ్రమదానంతో గిరిజనులు రోడ్డు పనులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని మారు మూల గిరిజన గ్రామాలకు చెందిన మట్టి రోడ్లు ఇటీవల కాలంలో కురిసిన తుపాను కారణంగా కోతకు గురి కావడంతో గిరిజనులు ఉదారా కదిలి వచ్చి శ్రమదానంతో రోడ్డు పనులు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

వేంగడ పంచాయతీ డొంకవలస మెయిన్ రోడ్డు నుండి గోమంగిపాడు వరకు గత వారం రోజుల నుండి గ్రామస్తులు శ్రమదానంతో పనులు చేపడుతున్నారు. మారుమూల కివర్ల పంచాయతీ పరిధి జంపవలసలో మూడు వారాల క్రితం రెండు వారాలుగా శ్రమదానంతో రోడ్డు పనులు చేపట్టారు.

లుంగపర్తి పంచాయతీ పరిధి మెట్టువలస నుండి ఒనుకొండ వరకు 15 రోజులు పాటు పిల్ల పాపలతో ఇంటింటా స్వచ్ఛందంగా తరలివచ్చి తమ రోడ్డు తామే మరమ్మతులు చేయాలనే లక్ష్యంతో ఆదివాసులు పనులను చేపట్టారు. ఇది ఇలా ఉండగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ మండలంలోని పెదకోట పంచాయతీలో గత సంవత్సరం క్రితం పర్యటించారు. డోలి రహిత ఆంధ్రప్రదేశ్ మార్చుతామని అడవితల్లి బాటలో భాగంగా మారుమూల గిరిజన గ్రామాలకు శాశ్వతంగా తారు రోడ్లు నిర్మాణానికి పలు గ్రామాలకు శంకుస్థాపనలు చేపట్టారు. నేటికీ ఏడాది గడుస్తున్నప్పటికీ మారుమూల గ్రామాలకు కనీసం రోడ్లు నిర్మించిన దాఖలాలు లేవు. తమ గ్రామాలకు రోడ్లు వేస్తారని ఆయా గ్రామాల గిరిజన ప్రజలు ఎదురు చూసినప్పటికీ కలగానే మిగిలింది. చేసేది ఏమీ లేక ఆయా గ్రామాల ఆదివాసి గిరిజనులు తుఫానులకు దెబ్బతిన్న రోడ్లను ముమ్మరంగా మరమ్మతు పనులు చేపడుతున్న పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితిలో బైక్‌లు, 108 అంబులెన్స్ వంటి వాహనాలు నడిచే మార్గాల గుంతలను పూడ్చి వేశారు. కూటమి ప్రభుత్వం ఆయా గ్రామాలకు శాశ్వతంగా తారు రోడ్డు పనులు చేయాలని పలు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.



రోడ్డు పనులు చేపడుతున్న పనులు

అంబులెన్స్‌లకు జిపిఎస్ అనుసంధానం

సేవల్లో పారదర్శకత, వేగవంతానికి చర్యలు



అంబులెన్స్‌కు అమర్చిన జిపిఎస్ చూపుతున్న పైలెట్

ప్రజాశక్తి-చింతపల్లి: పర్వత ప్రాంతాల్లో అత్యవసర వైద్యసేవలను వేగవంతం చేయాలనే లక్ష్యంతో పాడేరు ఐటిడిఎ కీలక ముందడుగు వేసింది ఐటిడిఎ. ప్రాజెక్టు అధికారిణి తిరుమణి శ్రీపూజ ఆదేశాల మేరకు చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, కంఠరం, కేడి పేట, నర్సీపట్నం ప్రాంతాలకు చెందిన అంబులెన్స్‌లన్నింటికీ ఆధునిక జిపిఎస్ ట్రాకింగ్ పరికరాలను అమర్చారు. దీంతో పర్వత ప్రాంతాలలో రోగుల ప్రాణాలను కాపాడే సేవలు మరింత వేగవంతం, క్రమబద్ధం, పారదర్శకంగా మారనున్నాయి. జిపిఎస్ అమలుతో అంబులెన్స్ ఎక్కడ ఉంది? ఎంత దూరం ప్రయాణించింది? ఏ మార్గంలో పయనిస్తోంది? ఏ రోగిని ఏ ఆసుపత్రికి తరలిస్తున్నారు? వంటి కీలక సమాచారం రియల్ టైమ్‌లో పర్యవేక్షణకు చేరుతోంది. అత్యవసర కాల్ వచ్చిన వెంటనే సమీప అంబులెన్స్‌ను సంబంధిత గ్రామానికి పంపే అవకాశం పెరగడంతో సేవల్లో ఆలస్యం గణనీయంగా తగ్గుతుందని వైద్యసిబ్బంది తెలిపారు. అంతకుముందు అంబులెన్స్ లభ్యతపై సందేహాలు, ఆలస్యం, మార్గదూర్పు వంటి సమస్యలు తరచూ ఎదురయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పుడు జీపీఎస్‌తో ఈ అంశాలన్నింటిపై పర్యవేక్షణ పెరగడంతో సేవల విశ్వసనీయత మరింత పెరిగింది. మారుమూల ప్రాంతాల్లో తరచూ ఎదురయ్యే ప్రమాదాలు, ప్రసవ అత్యవసరాలు, విషసర్పలు వంటి సందర్భాలలో అంబులెన్స్ చేరిక వేగవంతం అవుతుందని అధికారులు స్పష్టం చేశారు. జీపీఎస్ వ్యవస్థ ద్వారా ఇంధన వినియోగం, సిబ్బంది సమయపాలన, వాహన రూట్‌మ్యాప్, డ్రైవర్ పనితీరు వంటి అంశాలన్నీ నమోదు కావడంతో అంబులెన్స్ సేవలలో తప్పులను తగ్గించి పూర్తి క్రమశిక్షణను నెలకొల్పే అవకాశం లభించనుంది. ప్రజల ప్రాణాలకు విలువనిచ్చే ఈ ఆధునీకరణ చర్య పర్వత ప్రాంత ఆరోగ్య రంగానికి మేలు చేస్తుందని మన్యవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వవిద్యార్థుల సహకారం నిరుపమానం : ఎయు విసి

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఎయు అభివృద్ధికి పూర్వవిద్యార్థులు అందిస్తున్న సహకారం నిరుపమానమని విసి ఆచార్య జిపి.రాజశేఖర్ అన్నారు. ఇంజినీరింగ్ కళాశాల వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఎయు ఇంజినీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం 11వ వార్షిక సర్వసభ్య సమావేశం- పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ వికాసానికి, మౌలిక వసతుల కల్పనకు పూర్వవిద్యార్థులు విలువైన సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థులు స్వయంగా హాస్టల్ భవన సదుపాయాన్ని కల్పించడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. ఐవిఎన్ఎస్‌కె.విశ్వనాథరావు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో తమ సంఘం తరుపున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఫిబ్రవరి నాటికి హాస్టల్ భవనం మూడవ అంతస్తు పూర్తిచేసి వర్సిటీకి బహూకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆచార్య జి.రాంబాబు, బి.భాస్కరరావు, కె.ఉమేష్, ఆచార్య పి.కింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరిపై గంజాయి కేసు

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : యలమంచిలి పాత రైల్వేక్వార్టర్స్ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి తాగుతున్నారనే అందిన సమాచారం మేరకు టౌన్ ఎస్ఐ సావిత్రి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరిని పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, గాజువాక జంక్షన్‌లో ఒక గుర్తుతెలియని సన్యాసి నుంచి గంజాయి కొనుగోలు చేసి తాగుతున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు ఎస్ఐ సావిత్రి తెలిపారు. ఈ మేరకు ఎలమంచిలి తులసీనగర్‌కు చెందిన సింగపల్లి రమణ, రాంనగర్‌కు చెందిన మాడుగుల విజయకుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లు, 50గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అసభ్యకర నృత్యాలపై కేసు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలో గుండుపాలెం సమీపాన ఓ రిసార్ట్స్‌లో అసభ్యకర నృత్యాల ఘటనపై కేసు నమోదు చేసినట్లు సిఐ పి.పైడపునాయుడు తెలిపారు. వివరాలివి.

ఈనెల ఒకటో తేదీనిరాత్రి సమయంలో రిసార్ట్స్‌లో అసభ్యకర నృత్యాలు అక్రమ కార్యక్రమాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించగా; బుచ్చయ్యపేటకు చెందిన ఆర్గనైజర్‌తోపాటు చీడికాడ మండలం బైలపూడిక చెందిన ఏడుగురు పురుషులు, ఇద్దరు మహిళలను అదుపులో తీసుకున్నామన్నారు. డాన్స్ ప్రోగ్రాం పేరుతో అనకాపల్లి నుంచి పిలిపించి రిసార్ట్స్‌లో అసభ్యకర కార్యక్రమాలు చేయించినట్లుగా ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఏడుగురు పురుషలను ఒక ఆర్గనైజరును ఆదివారం అరెస్టు చేసి చోడవరం కోర్టు తరలించామని సీఐ తెలిపారు. మహిళలను మభ్యపెట్టి, వారితో అనైతిక కార్యక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు. ఇలాంటి ఘటనపై ప్రజలు నిర్భయంగా తమకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో నర్సింగిబిల్లి గ్రామం పరిధిలో అక్రమంగా కోడిపందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు కశింకోట పోలీసులు దాడి చేశారు. 8 మంది నిర్వాహకులను అరెస్టు చేసి, వారి నుండి రెండు కోళ్ళు, రూ.650 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ స్వామి నాయడు ఆదివారం తెలిపారు, ఎస్ఐ మనోజ్ కుమార్ పోలీస్ సిబ్బందితో దాడి చేయగ, కోడిపందేలు ఆడుతున్న వారిని పట్టుకున్నారని తెలిపారు. కోడిపందేలు ఆడడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం నేరమని, నిందితులు ఎంతటి వారైనా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పౌరగ్రంథాలయంలో కామెడీ షో

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యాన 'వినోదాల విందు'లో భాగంగా ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆదివారం కామెడీ షో నిర్వహించారు. ఎంవి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, రాగన్ నాయుడు, సూర్య మంత్రాపు, పుషమి, జివి.లక్ష్మి, భానుప్రకాష్, రామానుజం గిరిజ, కామెడీ స్కిట్లను ప్రదర్శించారు. ముందుగా హరహర నృత్యనికేతన్ స్కూల్ గురువు అల్లు వెంకట రమణ, శిష్యులు కోటా అనన్య, ఉజ్వల, ఎం.శరణ్య శాస్త్రీయ నాట్య ప్రదర్శనలిచ్చారు. అనంతరం జపాన్, సబ్బవరానికి దారి, అడవర్స్ రిపోర్ట్, ఒక నెంబర్‌కు ఫోన్, జాయింట్ ఖాతా, ధర్మం, డాక్టర్-పేషెంట్, మాట వినలేదు, విగ్గు, వారం సెలవు స్కిట్లను ప్రదర్శించారు. అధితులు తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, బి.నాగరాజారావు బహుమతులు అందజేశారు.

డైట్‌లో భవన సముదాయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్ ఆవరణలో డైట్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కార్యక్రమంలో భాగంగా రూ.13.65 కోట్లతో నిర్మించనున్న నూతన భవన సముదాయానికి ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుతో కలిసి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జోన్- 1 ఆర్‌జెడి విజయభాస్కర్, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరావు, ఎంఇఒ 1, 2లు ఎం.శివరాణి, ఎ.జయప్రద, సమగ్ర శిక్ష డిఇఇ నరసింహారావు, మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు పాల్గొన్నారు.

మంత్రి రామ్మోహన్‌నాయుడు రాజీనామా చేయాలి

- విమానయాన సంక్షోభం పరిష్కారంలో ఆయన విఫలం
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో విమానయాన రంగ సంక్షోభాన్ని పరిష్కరించడంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పూర్తిగా విఫలమయ్యారని, తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. నగరంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, టిడిపి నేతల ప్రచారాన్ని తీవ్రంగా ఎండగట్టారు. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ అమలు చేయడంతో తలెత్తిన పరిస్థితులను అంచనా వేయడంలో, పరిష్కరించడంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు విఫలమయ్యారని దుయ్యబట్టారు. ప్రైవేటు సంస్థలకు కొమ్ముకాస్తూ, ఇష్టమొచ్చినట్లుగా టిక్కెట్ ధరలు పెంచిన విమానయాన సంస్థలను ఆయన అదుపు చేయలేకపోయారన్నారు. ప్రస్తుతం విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే రూ.30 వేలు, ఢిల్లీకి రూ.50 వేలు ఛార్జ్ చేస్తున్నారని తెలిపారు. ప్రయాణికుల భద్రతను పణంగా పెట్టి ఎఫ్‌డిటిఎల్ నిబంధనను వెనక్కి తీసుకుంటామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. జూన్‌లో జరిగిన విమాన ప్రమాదం నుంచి నేటి సంక్షోభం వరకు రీల్స్ చేయడం, భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ దొంగిలించడం తప్ప కేంద్రమంత్రి సాధించింది ఏమీ లేదని అమర్‌నాథ్ విమర్శించారు. విజయవాడ ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులపైనా ఆయనకు పట్టింపు లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన లక్షలాది మంది ప్రయాణికులకు తక్షణమే క్షమాపణలు చెప్పాలన్నారు. సంక్షోభాన్ని పరిష్కరించి, టిక్కెట్ ధరలను అదుపులోకి తీసుకురావాలన్నారు.

ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలి

విశాఖ ఉక్కు కర్మాగారంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 9500 మంది ఉద్యోగులను తొలగించి, 42 విభాగాలను ప్రైవేటుపరం చేస్తున్నారని అమర్‌నాథ్ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర మంత్రి కృషి చేయాలన్నారు.

పోలీసులకు ట్రాఫిక్ బారికేడ్లు అందజేత

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: నగరంలో మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ విశాఖపట్నం నగర ట్రాఫిక్ పోలీసులకు కొత్తగా రూపొందించిన ట్రాఫిక్ బారికేడ్లు అందజేసింది. ఆదివారం హాస్పటల్ వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడిసిపి ప్రవీణ్‌కుమార్‌కి మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లోని సీనియర్ జనరల్ ఆప్తాల్మజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా ట్రాఫిక్ బారికేడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బారికేడ్లు అధిక రద్దీ ఉన్న ప్రాంతాలలో ట్రాఫిక్‌ను నియంత్రించడంలో, రద్దీ సమయాల్లో రోడ్డు భద్రతను మెరుగుపర చడంలో పోలీస్ విభాగానికి సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో నగర ట్రాఫిక్ ఎసిపి తూర్పు ట్రాఫిక్ సర్కిల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, రిటైర్డ్ ఆర్ఎంఎస్ (ఇండియన్ పోస్ట్) బాబురావురెడ్డి పాల్గొన్నారు. మ్యాక్స్ విజన్ చేపట్టిన కార్యక్రమంను అభినందించారు.

ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ..

కాకరపాడు జంక్షన్‌లో బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలో ప్రధానమైన కాకరపాడు మూడురోడ్ల జంక్షన్లో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్ కోసం నిరీక్షించాల్సిందే. జాతీయ రహదారి 5169 నిర్మాణంలో భాగంగా రోడ్డు వెంబడి అక్కడక్కడ ఉన్న పాత బస్ షెల్టర్లను తొలగించి, వాటి స్థానంలో కొత్త షెల్టర్లను నిర్మించారు. అయితే కాకరపాడులో మాత్రం పాత బస్‌షెల్టర్ తొలగిం చినప్పటికీ, కొత్తగా బస్సుషెల్టర్ నిర్మించకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా బస్‌షెల్టర్ నిర్మించాలని కోరుతున్నారు.



ఎండలో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలో రేఖపల్లి ఎంఆర్‌సి వద్ద యుటిఎఫ్ మండల కౌన్సిల్ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కృష్ణయ్య, యు.వెంకటనారాయణ, కన్నారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం తగదని ఆక్షేపించారు. ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేసారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని ఎత్తివేసి, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన అందించేందుకు ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. బోధనేతర పనులను పూర్తిగా తప్పించాలని. మోడల్ ప్రైమరి స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలని కోరారు. మండల కౌన్సిల్‌లో జిల్లా కార్యదర్శి యస్ నాగేశ్వరావు, బాబురావు, ఎన్.రామకృష్ణ, యస్.అజయకుమార్, రామారావు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన వ్యక్తులతో ఎస్ఐ శివకుమార్

చిత్తులాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, రంపచోడవరం డిఎస్పి జి.ఎస్ ప్రశాంత్ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి సిఐ గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో చిత్తులాట ఆడుతున్నారనే సమాచారంతో రాజవొమ్మంగి శాంతినగర్ శివారు ప్రాంతంలో చిత్తులాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 3వేల నగదు, రెండు, 5 రూపాయల కాయిన్స్‌ను సీజ్ చేసారు. మరో నలుగురు వ్యక్తులు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు. వారి మీద కూడా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న సత్యనారాయణ తదితరులు

ఉద్యోగుల పే రివిజన్ కమిషన్ త్వరగా వేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను లెక్కగట్టి ముందుగా సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఆ బకాయిలకు బదులుగా ప్రభుత్వ భూమిని ఉద్యోగులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం నూతన కార్యాలయ భవనం ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్‌కుమార్ హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ మాట్లాడుతూ,12వ పే రివిజన్ కమిషన్ ముగ్గురు సభ్యులతో త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ లోగా ఐఆర్ ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై కూడా ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

చిత్తశుద్ధితో పనులు చేయాలి

- జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:

చిత్తశుద్ధితో పనులు నిర్వహించాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్-3,4 పరిధి ఆర్‌టిసి కాంప్లెక్స్, సిరిపురం, సత్యం జంక్షన్, సీతమ్మధర, డైమండ్ పార్క్ తదితర ప్రాంతాల్లో కేతన్‌గార్గ్ శనివారం అర్ధరాత్రి ఆకస్మికంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ పట్టుదల, నిబద్ధత, చిత్తశుద్ధితో విధులను నిర్వర్తించాలని సూచించారు. ఎక్కడా చెత్త లేకుండా నగరాన్ని నీట్‌గా ఉంచాలన్నారు. రాత్రి సమయంలో పారిశుధ్య పనులు చేయడం, నగర సుందరీకరణ కాపాడటంలో అత్యంత కీలకమైనదని కమిషనర్ వెల్లడించారు. నగరం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, అందంగా ఉండేలా బాధ్యతతో పనిచేయాలని పారిశుధ్య సిబ్బందికి కమిషనర్ సూచించారు. కమర్షియల్ ప్రాంతాల్లో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, శానిటేషన్ నిబంధనల అమలు పర్యవేక్షణను కమిషనర్ సమీక్షించారు. వ్యాపార సముదాయాల నుండి చెత్త సేకరణ, సమయానికి వ్యర్థాలను తొలగించడం, రాత్రి సమయంలో శుభ్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించడం అవసరమని ఆయన పేర్కొన్నారు.

ఎండాడలో సామాజిక భవనం నిర్మించాలి

జాతీయ యాదవ ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :

ఎండాడలో గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో యాదవ సామాజిక తరగతి భవనాన్ని నిర్మించాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షులు ఆల్సి అప్పల నారాయణయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడు తూ, ఎండాడలో కాకుండా ముడసర్లోవ ప్రాంతంలో యాదవ సామాజిక భవనం నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించడం సరికాదన్నారు. ఎండాడ జాతీయ రహదారిలో ఉందని, విశాఖ, అనకాపల్లి ప్రాంతాలతో పాటు విజయనగరం వగైరా జిల్లాలకు కూడా ఈ స్థలం అందుబాటులో ఉంటుంద న్నారు. ప్రస్తుతం యాదవ సామాజికవర్గం శాసనసభ్యులుగా ఉన్న పల్లా శ్రీనివాసరావు, సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ దీనికోసం కృషి చేయాలన్నారు. జివిఎంసిలో ఉన్న యాదవ సామాజిక తరగతికి చెందిన 28 మంది కార్పొరేటర్లు దీనికి సహకరించాలన్నారు. ఎండాడలో యాదవ భవనం నిర్మాణం కోసం ఒక్కొక్క చదరపు గజానికి రూ.2500 చొప్పున వసూలు చేశారని, ఈ విధంగా వసూలు చేసిన లక్షలాది రూపాయలు ఏం చేశారని ప్రశ్నించారు. విశాఖ జిల్లా యాదవ సంఘానికి అధ్యక్షులుగా ఎంతోమంది పనిచేశారని, వారిలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా ఉన్నారన్నారు. ఎండాడ యాదవ భవనాన్ని రద్దు చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముడసర్లోవ వద్ద యాదవ భవనం నిర్మాణానికి ఇచ్చిన జిఒ 475ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ యాదవ ఐక్యవేదిక ఉపాధ్యక్షులు అల్లు రమణారావు, కార్యదర్శి పల్లా వెంకట అప్పారావు, ప్రచార కార్యదర్శి నక్క సాంబశివరావు, విశాఖపట్నం యాదవ సంఘం కార్యదర్శి పాత్రపల్లి వెంకట నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు వియ్యపు గంగరాజు, మహిళ నాయకురాలు పీతల అప్పయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షులు అప్పల నారాయణ యాదవ్